26న మరో అల్పపీడనం

16 జిల్లాలకు వర్షసూచన

అడయార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ తీరంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో వాయుగుండంగా, ఆ తర్వాత తుపానుగా మారే అవకాశం ఉందని, దీని కారణంగా 16 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ కార్యాలయం ఆదివారం వెల్లడించింది. ఇదే విధంగా ఈ నెల 26న నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీంతో ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలో పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు. అండమాన్ తీరం వద్ద కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణిస్తుందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది వాయుగండంగా మారిన తర్వాత కేవలం 48 గంటల వ్యవధిలోనే మరింత బలపడి తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ తుపానుకు యూఏఈ సూచించిన 'సెన్యార్' అనే పేరు ఖరారు చేయనున్నారు. అరబిక్ భాషలో సెన్యార్ అంటే సింహం అని అర్థం. ఈ కారణంగా, కన్నియాకుమారి, తిరునెల్వేలి, తూత్తుక్కుడి, తెన్‌కాశి, రామనాథపురం, శివగంగై, విరుదునగర్, మదురై, అరియలూరు కల్లకుర్చి, పుదుక్కోట, తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదుర్రై, కడలూరుతో సహా మొత్తం 16 జిల్లా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ అధికారులు వెల్లడించారు. చెన్నై నగరంలో రాగల 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దక్షిణ తమిళనాడు కోస్తాతీర ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళరాదని సూచించారు.

తిరువణ్ణామలైలో

నేడు కార్తిక దీపోత్సవాలు ప్రారంభం



ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచభూత స్థలాల్లో అగ్నిక్షేత్రంగా పేరుగాంచిన తిరువణ్ణామలై క్షేత్రం కార్తిక దీపోత్సవాలకు ప్రత్యేకంగా ముస్తాబైంది. ఉన్నామలై సమేత అన్నామలైయార్ ఆలయంలో సోమవారం ఉదయం స్వామివారి సన్నిధిలో ధ్వజారోహణంతో కార్తిక దీపోత్సవాలకు శ్రీకారం చుడతారు. తొలిరోజు నుండి ఉదయం, సాయంత్రం వినాయకుడు, వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, ఉన్నాములై సమేత అరుణాచలేశ్వరుడు, దుర్గాదేవి, చండికేశ్వరుడి సహా పంచమూర్తులను అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. పతాకావిష్కరణను పురస్కరించుకుని ఆదివారం ఉదయం వినాయక ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి మూషిక వాహనంలో లంబోదరుడిని, వృషభ వాహనంలో చండికేశ్వరుడిని ఆలయ మాడవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈ నెల 29వ తేదీ శనివారం రాత్రి వెండి రథోత్సవం, 30వ మహారథోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కార్తిక దీపోత్సవాల్లో ప్రధానంశమైన మహాదీపోత్సవం డిసెంబరు 3న జరుగనుంది. ఆ రోజు తెల్లవారు జామును 4గంటలకు ఆలయంలో భరణిదీపం వెలిగిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఏడాదికి ఒకసారి మాత్రమే దర్శనం భాగ్యం కలిగించే అర్ధనారీశ్వరుడు ఆలయ రాజగోపురం ముందు ఆనంద తాండవంతో భక్తులను కటాక్షిస్తారు. ఆ తర్వాత అన్నామలైయార్ కొండ శిఖరంపై శివాచార్యులు మహాదీపం వెలిగిస్తారు. ఈ దీప దర్శనం కోసం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగున వున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర ప్రాంతాల నుంచి దాదాపు 40 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశముంది. తిరువణ్ణామలై జిల్లా యంత్రాంగం తరుపున భక్తులకు కనీస వసతుల కల్పనకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బస్టాండ్, వాచ్‌టవర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అందరికీ ఇల్లు, ఇంటికో బైకు

- కారు కూడా ఇవ్వాలన్న ఆశ వుంది

● కంచి సభలో విజయ్ హామీల వర్షం



ప్రసంగిస్తున్న టీవీకే నేత విజయ్



సభకు హాజరైన మహిళలు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని గెలిపిస్తే అందరికీ ఇండ్లు కట్టించి ఇవ్వడంతో పాటు ఇంటింటికీ ఓ బైకు ఉచితంగా ఇస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం కాంచీపురం జిల్లా కున్నం గ్రామంలోని జేప్పియార్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.టీవీకే అధికారంలోకి వస్తే... అంటూ కొన్ని క్షణాలపాటు ప్రసంగాన్ని ఆపి ఆ తర్వాత 'వస్తే ఏమిటి? వచ్చితీరుతుందని, ఈ విషయంలో తనకెలాంటి అనుమానాలు లేవని, ప్రజలంతా తనవైపే ఉన్నారని చెప్పారు. ప్రతి ఇంటికి ఓ కారు కూడా ఉచితంగా ఇవ్వాలనే ఆశ ఉందని, ఆ ఆశ నెరవేరే రోజులు త్వరలో వస్తాయన్నారు. ఇక ప్రతి ఇంటా ఒక వ్యక్తి కుటుంబ ఖర్చులకు సరిపడా సంపాదించేలా ఉపాధి అవకాశం కల్పిస్తామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తామని, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం భరోసా ఇస్తుందని చెప్పారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ తన రాజకీయ గురువైన దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై ఫొటోను తన పతాకంలో పెట్టుకున్నారని, అలాంటి పార్టీ (అన్నాడీఎంకే)ని హస్తగతం చేసుకున్నవారంతా ప్రస్తుతం ఏం చేస్తున్నారో తాను చెప్పదలచుకోలేదంటూ విమర్శించారు. వ్యక్తిగతంగా ఆపార్టీ (అన్నాడీఎంకే)తో ఎలాంటి తగాదాలు లేవని, ఆ పార్టీవారు మాపై పగబట్టినా పట్టించుకోమని, అదలావుంచితే ప్రజలకు మాయమాటలు చెప్పి, మోసగించి అధికారంలోకి వచ్చిన ప్రస్తుత పాలకులను ప్రశ్నించకుండా ఉండలేనన్నారు. కాంచీపురం జిల్లాకు తనకు మధ్య అవినాభావ సంబంధాలున్నాయని తన మొదటి రాజకీయ పర్యటన ఆ జిల్లాలోని పరందూరు నుంచే ప్రారంభమైందని చెప్పారు. టీవీకే నేతలను కార్యకర్తలను తెలివితక్కువ దద్దమ్మలంటూ డీఎంకే నేతలు విమర్శలు చేసి అభాసుపాలయ్యారన్నారు. వజ్రోత్సవాలు జరుపుకున్న రాజకీయ పార్టీగా డంబాలు పలుకుతున్న డీఎంకే నేతలకు ప్రధాన లక్ష్యాలు, సిద్ధాంతాలు ఏవీ లేవని, ప్రజల ఆస్తులను దోచుకోవడమే వారి లక్ష్యమని విజయ్ ఆరోపించారు. అధికారంలోకి వస్తే నీట్ పరీక్షలను రద్దు చేస్తామని చెప్పిన డీఎంకే నేతలు ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. డీఎంకేను ఇప్పటి వరకూ తీవ్రంగా విమర్శించలేదని, త్వరలోనే తాను చేసే విమర్శలను తట్టుకోలేక పార్టీ పత్తా లేకుండా పోవడం ఖాయమన్నారు.

దోచుకోవడమే డీఎంకే పని...

కాంచీపురం జిల్లాకు డీఎంకే ప్రభుత్వం చేసిందేమీ లేదని, పాలారులో పరిమితికి మించిన ఇసుక తోడుకుని రూ.4730 కోట్లు సంపాదించారని, ఆధారాలు లేకుండా తానీ ఆరోపణలు చేయడం లేదని ఈడీ కోర్టులో దాఖలు చేసిన ఆధార పత్రాల్లో ఈ వివరాలున్నాయని చెప్పారు. కంచి పట్టు నేత కార్మికుల సంక్షేమాన్ని డీఎంకే ప్రభుత్వం విస్మరించడంతో కనీసం రోజుకు రూ.500 కూడా సంపాదించలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి బద్ధశత్రువు డీఎంకే అని, సిద్ధాంత పరంగా బీజేపీ రాజకీయ ప్రత్యర్థి అని ఆయన మరోమారు ప్రకటించారు.

కరూర్ దుర్ఘటనపై

నోరెత్తని విజయ్

- డీఎంకే నేత ఇళంగోవన్



చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై నోరెత్తని టీవీకే నేత విజయ్ ప్రజలకు అండగా ఉంటానని ప్రతిసభలోనూ ప్రకటించడం విడ్డూరంగా ఉందని డీఎంకే ప్రచార విభాగం నేత టీకేఎస్ ఇళంగోవన్ ధ్వజమెత్తారు. ఓఎమ్మార్ ఇంజనీరింగ్ కళాశాలలో విజయ్ కాంచీపురం నిర్వాహకుల సమావేశంలో డీఎంకేకు లక్ష్యాలు, సిద్ధాంతాలు లేవని విజయ్ విమర్శించడం ఆయనకు రాజకీయ పరిజ్ఞానం బొత్తిగా లేదని స్పష్టమైందన్నారు. విజయ్‌కి అన్నాదురై గురించి ఏ మాత్రం తెలియదని, ముఖ్యమంత్రి కావాలని ఆయన పార్టీని ప్రారంభించలేదని, ప్రజల కోసం పోరాడి పలుమార్లు జైలుకు వెళ్ళిన నేత అని గుర్తుచేశారు. పార్టీని ప్రారంభించగానే తానే ముఖ్యమంత్రి అవుతానని దురాశ పెట్టుకుని విజయ్ సభలు జరుపుతున్నారని విమర్శించారు. పార్టీ సిద్ధాంతాల కోసం, ఆశయాల కోసం జైలు కెళ్ళిన చరిత్ర డీఎంకే నేతలదని, అన్నాదురై లక్ష్యాలనే డీఎంకే కొనసాగిస్తోందన్నారు. కరూర్‌లో తన కళ్లెదుటే తొక్కిసలాట జరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా అర్థాంతరంగా ప్రసంగాన్ని ముగించుకుని భయంతో పరారైన విజయ్ ప్రజలకు తానెప్పుడూ అండగా ఆదరణగా ఉంటానని చెబుతుండటం వింతగా ఉందన్నారు. బీజేపీ అంటే భయంతో వణకిపోతున్న విజయ్ ప్రజలు ఎలా కాపాడగలుగుతారో సమాధానం చెప్పాలని ఇళంగోవన్ డిమాండ్ చేశారు.

తమిళన్బన్‌కు కన్నీటి వీడ్కోలు



తమిళన్బన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహితీవేత్త, రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఈరోడ్ తమిళన్బన్ అంత్యక్రియ లు ఆత్మీయులు, తమిళసాహితీ ప్రముఖులు, కుటుంబీకుల అశ్రునయనాల నడుమ పోలీసు లాంచనాలతో ఆదివారం ఉదయం జరిగాయి. శనివారం ఉదయం కన్నుమూసిన తమిళన్బన్ మృతదేహాన్ని కోయంబేడులోని ఆయన నివాసం వద్ద ప్రజల సందర్శన కోసం ఉంచారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. తమిళన్బన్ అంత్యక్రియలు పోలీసు లాంచనాల నడుమ జరుగుతుందని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం ఉదయం కుటుంబీకులు ఆయన అంత్యక్రియల ఏర్పాట్లు ప్రారంభించారు. కోయంబేడు నివాసగృహం నుండి అరుంబాక్కం శ్మశానవాటిక వరకు తమిళన్బన్ భౌతికకాయాన్ని ఊరేగించారు. ఆ తర్వాత అధికార లాంచనాలతో ఆయన దహనక్రియలు నిర్వహించారు.

10న అన్నాడీఎంకే

సర్వసభ్య సమావేశం



ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం డిసెంబర్ 10 జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యాదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఏడాదికి రెండుసార్లు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సివుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం డిసెంబరు 10న వానగరంలోని శ్రీవారు వేంకటాచలపతి కల్యాణ మండపంలో జరుగుతుందని ఈపీఎస్ తెలిపారు ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మండలి సమావేశానికి పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్‌హుస్సేన్ అధ్యక్షత వహిస్తారని, అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు, సీట్ల పంపకం, ప్రచార వ్యూహం తదితర అంశాలపై చర్చించనున్నట్టు ఈపీఎస్ తెలిపారు.

30 నుంచి మళ్లీ ఈపీఎస్ ప్రచారం

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మళ్లీ ప్రచారయాత్రకు సిద్ధమయ్యారు. ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయంలో ఈ నెల 30న ఈపీఎస్ ప్రచారాన్ని ప్రారంభిస్తారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో ఈపీఎస్ రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల పర్యటన జూలై 7న కోవై జిల్లా మేట్టుపాళయంలో ప్రారంభమై అక్టోబరు 10వ తేదీ వరకు సాగింది. ఈ యాత్ర మళ్లీ ఈపీఎస్‌ను వ్యతిరేకిస్తున్న కేఏ సెంగోట్టయ్యన్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న గోపిచెట్టిపాళయం నుండి ప్రారంభం కావడం గమనార్హం.

సత్యసాయి సేవలు

కొనసాగించాలి

- సందేశంలో పేర్కొన్న సీఎం స్టాలిన్



స్టాలిన్ సందేశాన్ని రత్నాకర్‌కు అందజేస్తున్న దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్యారే, విద్య అందించటంలోనూ పుట్టపర్తి సాయిబాబా ఎంతో ఖ్యాతినొందారని, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన ఓ సందేశం వెలువరించారు. ఆ సందేశాన్ని ఆదివారం ఉదయం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పుట్టపర్తిలో జరిగిన వేడుకలలో పాల్గొని సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌కు అందజేశారు. ఆ సందేశంలో కృష్ణానదీ జలాల పంపిణీ విషయంలో సత్యసాయిబాబు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య సయోధ్య కూర్చే సారథిగా వ్యవహరించడం తనకింకా గుర్తుందని స్టాలిన్ పేర్కొన్నారు. నిరుపేదలను, బడుగు బలహీనవర్గాలవారిని ఆదుకునేందు సత్యసాయి ప్రారంభించిన సేవా కార్యక్రమాలను కొనసాగించాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

కాంగ్రెస్‌కు మరిన్ని సీట్ల కోసం పట్టుబడదాం

● పొత్తు కమిటీ నిర్ణయం



సమావేశంలో కాంగ్రెస్ ఎన్నికల పొత్తు కమిటీ సభ్యులు

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరుపున పోటీ చేసేందుకు తమ పార్టీకి మరిన్ని సీట్లు కోరనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వపెరుందగై పేర్కొన్నారు వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో, పొత్తుపై చర్చలకు ఐదుగురితో కూడిన కమిటీని ఏఐసీసీ నియమించిన విషయం తెలిసిందే. తమిళనాడులో ఎన్నికల పొత్తుపై మిత్రపక్షాలతో చర్చల్లో పాల్గొనేందుకు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి గిరీష్ చోడంగర్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఏఐసీసీ కార్యదర్శులు సూరజ్ ఎంఎన్ హెగ్డే, నివేదిత్ ఆళ్వా, తమిళనాడు అసెంబ్లీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఎస్.రాజేష్‌కుమార్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆదివారం రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తిభవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, కృష్ణస్వామి, తిరునావుక్కరసు, మాజీ ఎంపీ పీటర్ ఎల్ఫోన్స్, ఎంపీ శశికాంత్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కేటాయించిన 25 సీట్లలో విజయం సాధించిన 18 నియోజకవర్గాల్లో విజయావకాశాలు ఎలా ఉన్నాయి?, ఏఏ స్థానాల్లో పార్టీకి ఓటు బ్యాంకు అధికంగా ఉందన్న అంశాలపై చర్చించారు. సమావేశం ప్రతిపాదించిన తీర్మానాల గురించి సెల్వపెరుందగై మీడియాకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో లాగే వచ్చే ఏడాది ఎన్నికల్లో కూడా డీఎంకే నేతృత్వంలోని కూటమి తరుపున పోటీ చేస్తామన్నారు. ఏఏ నియోజకవర్గాల్లో పోటీచేయాలన్న దానిపై పార్టీ ఎన్నికల కమిటీ మళ్లీ సమావేశమై చర్చిస్తుందన్నారు. ఈ సారి తమకు మరిన్ని సీట్లు కేటాయించాల్సిందిగా కూటమి నేత, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలో తమకు వాటా కల్పించాలని కోరే ఉద్దేశం లేదన్నారు. మిత్రపక్షాల తరుపున 234 నియోజకవర్గాల్లో ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్‌పై దృష్టిసారించాల్సిందిగా అన్ని జిల్లాల కాంగ్రెస్ నిర్వాహకులకు పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీచేసిందని ఆయన తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభం

- విద్యుదాఘాతానికి దంపతులు సహా ముగ్గురి మృతి



మృతులు పిలోన్‌మేరి, సూసై, వనదాసు మేరి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం కూలిపడిన ఘటనలో, దంపతులు సహా ముగ్గురు మృత్యువాతపడ్డారు. కడలూరు జిల్లా సాత్తుమంగళం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడగా, విద్యుత్ స్తంభం కూడా నేలకొరిగింది. సమీపంలో ఉన్న సూసై (70), ఆయన భార్య పిలోన్‌మేరి (60), వనదాసు మేరీలకు విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఒరత్తూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని చెట్టు శిథిలాల కింద నుంచి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

దుబాయ్‌లో 'తేజస్' దుర్ఘటన

- పైలెట్ నమన్ష్ సియాల్‌కు కోవైలో నివాళి

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ వైమానిక విన్యాసాల్లో తేజస్ ఎంకే 1 కూలిన దుర్ఘటనలో మరణించిన పైలెట్ వింగ్ కమాండర్ నమన్ష్ సియోల్ భౌతికకాయానికి కోయంబత్తూరులోని సూలూరు వైమానిక దళం వద్ద ఆదివారం ఉదయం అధికారులు, సిబ్బంది ఘననివాళులర్పించారు. నమన్ష్ సియోల్ సూలూరు వైమానిక దళంలోనే పనిచేస్తున్నారు. అక్కడే క్వార్టర్స్‌లోనే భార్యతోపాటు నివసిస్తున్నారు. ఆమె కూడా వైమానిక దళంలో అధికారిగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఏడేళ్ల కుమార్తె ఉంది. ఈ నేపథ్యంలో దుబాయ్ వైమానిక విన్యాసాల సందర్భంగా విమానం కూలిపడి మృతి చెందిన నమన్ష్ సియోల్ భౌతికకాయం దుబాయ్ నుంచి విమానంలో శనివారం రాత్రి సూలూరు వైమానిక దళానికి తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని వైమానిక దళం గ్రౌండ్‌కు తీసుకొచ్చి అధికారులు, ఉద్యోగులు, జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్, ఎస్పీ కార్తికేయన్ తదితరులు నివాళులర్పించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో ఆయన స్వస్థలమైన హిమాచల్ ప్రదేశ్‌కు తీసుకెళ్ళారు.



సూలూరు వైమానిక దళం వద్ద వింగ్ కమాండర్ నమన్ష్ సియోల్ భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు



ప్రముఖ తమిళ కవి సురదా 105వ జయంతి సందర్భంగా అశోక్‌నగర్‌లోఆయన విగ్రహానికి పూలమాలవేసి, చిత్రపటం వద్ద నివాళుల ర్పిస్తున్న మంత్రి ఎస్ఎం. నాజర్, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, సమాచార శాఖ కార్యదర్శి వి.రాజారామన్ తదితరులు

రూ.2,036 కోట్లతో 28 మెట్రోరైళ్ల కొనుగోలు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరు బోగీలతో నడిచే 28 కొత్త మెట్రోరైళ్ల కొనుగోలుకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) టెండర్లు ఆహ్వానించింది. నగరంలో ప్రస్తుతం రెండు మార్గాల్లో నాలుగు బోగీలతో కూడిన మెట్రోరైళ్లు నడుపుతుండగా, ప్రతిరోజు సరాసరిన 3.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. పీక్ అవర్స్‌లో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండడంతో, అదనపు బోగీలు జతచేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ... మెట్రోరైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా ఆరు బోగీలతో మెట్రోరైళ్లు నడపాలని నిర్ణయించామన్నారు. అందుకోసం రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫారం విస్తీర్ణం, అవసరమైన పనులు చేపట్టామన్నారు. తొలివిడతగా ఆరు బోగీలతో కూడిన 28 మెట్రోరైళ్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. మరో రెండేళ్లలో ఈ కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.



కన్నియాకుమారి జిల్లా సుశీంద్రం తానుమాలయన్ స్వామి ఆలయంలో మూలనక్షత్రం సందర్భంగా 18 అడుగుల ఆంజనేయస్వామికి రజత కవచధారణ



శివగంగ జిల్లా తిరుపత్తూరులో ఆదివారం జరిగిన శ్రీలంక మాజీ మంత్రి ఎస్ఆర్ఎం ఆరుముగం తొండైమాన్ కుమారుడు జీవన్ కుమారవేల్ వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆ దేశ పూర్వాధ్యక్షుడు రనీల్ విక్రమసింఘే, మంత్రులు

సేలం రాజమురుగన్ ఆలయం ఎదుట

56 అడుగుల మురుగన్ విగ్రహం



ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన భారీ మురుగన్ విగ్రహం

చెన్నై, నవంబరు (ఆంధ్రజ్యోతి): సేలంలో తారామంగళం ప్రాంతం అనైమేడు వద్దనున్న రాజ మురుగన్ ఆలయం వద్ద ఆదివారం ఉదయం 56 అడుగుల మురుగన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. రెండేళ్ల క్రితం ఆ విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. యేడాది తర్వాత అన్ని హంగులు పూర్తి చేసుకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించే సమయంలో ఆ విగ్రహం సుబ్రహ్మణ్యస్వామివారిలా లేదని సోషల్ మీడియాలో వీడియోలు వెలువడ్డాయి. దీంతో రూ.40లక్షల వ్యయంతో ఆ విగ్రహానికి బదులు మరో కొత్త విగ్రహం చేయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆ ఆలయం వద్ద 56 అడుగుల అందమైన రాజ మురుగన్ విగ్రహాన్ని భారీ క్రేన్‌ల సహాయంతో ప్రతిష్ఠించారు. ఈ వేడుకలలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఫైనల్లీ భరత్ హీరోగా శాంతి టాకీస్ చిత్రం



ఫైనల్లీ భరత్, శాన్వి మేఘ్న తదితరులు

చిత్రజ్యోతి

'మావీరన్', '3బీహెచ్‌కే' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన శాంతి టాకీస్ మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఫైనల్లీ భరత్ హీరోగా, శాన్వి మేఘ్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. నగరంలో తాజాగా ఓ చిన్న పూజా కార్యక్రమంతో షూటింగ్ ప్రారంభించారు. ఈ మూవీ విశేషాలను నిర్మాత అరుణ్ విశ్వా మాట్లాడుతూ, 'ఫైనల్లీ భరత్ మంచి ప్రజాదారణ పొందిన వ్యక్తి. ఈ సినిమా కోసం అతనితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. అలాగే, 'కుడుంబస్థన్' మూవీతో ప్రేక్షకుల మనసులను గెలుచుకున్న శాన్వి ఇందులో కథానాయికగా ఎంపిక చేశాం. యువ ప్రతిభను ప్రోత్సహించడం మాకు ఎంతో సంతోషకరంగా ఉంది. ఇది మా బ్యానరుపై నిర్మించే నాలుగో చిత్రం. ఈ మూవీ ద్వారా హరిహరసుధన్‌ను దర్శకుడిగా పరిచయం చేయడం గర్వంగా ఉంది. ఇందులో బాలశరవణన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

ఒత్తిడిని ఎలా జయించాలో చెప్పే 'ఎల్లో'



'ఎల్లో' చిత్రంలో ఓ దృశ్యం

ఉరుకుల పరుగుల పయనంలో మనిషి తీవ్రమైన ఒత్తిడిని ఎలా జయించాలో తెలియజెప్పే చిత్రంగా 'ఎల్లో' రూపొందించినట్టు ఆ చిత్ర దర్శకుడు హరి మహాదేవన్ తెలిపారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ వస్తోందని వెల్లడించారు. పూర్ణిమ రవి హీరోయిన్‌గా నటించారు. ప్రేమ వైఫల్యంతో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొనే ఆమె తన కుటుంబ బాధ్యతలను ఎలా నెరవేరుస్తూ తాను అనుకున్న లక్ష్యానికి చేరుకున్నారా? లేదా? అనే సందేశంతో లేడీ ఓరియంటెడ్ మూవీగా తెరకెక్కించినట్టు దర్శకుడు తెలిపారు. ఒత్తిడిలో ఉంటూ ఏమీ చేయలేకపోతున్నామనే బాధపడే ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం కలిగించే సంభాషణలున్నాయని, ప్రతి ఒక్కరూ చూడదగిన సినిమా అని వెల్లడించారు. సినిమాలో పర్వతాలు, జలపాతాలు వంటి సుందరమైన ప్రాంతాలను కెమెరామెన్ అబి ఆద్వి తన కెమెరాలో అద్భుతంగా చిత్రీకరించారు.

రెజీనా కెసాండ్రా @ 20



ప్రముఖ హీరోయిన్ రెజీనా కెసాండ్రా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటిస్తూ ఎంతో బీజీగా గడుపుతున్నారు. 'కండ నాల్ ముదల్' అనే చిత్రం ద్వారా తమిళంలోకి అడుగుపెట్టిన రెజీనా నటించిన తొలి చిత్రం 2005 నవంబరు 18న ఈ చిత్రం విడుదలైంది. ఆమె వెండితెరకు పరిచయమై 20 యేళ్ళు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ట్వీట్ చేశారు. 'నేను మొదటిసారి షూటింగ్ లొకేషన్‌కు వెళ్ళడం నిన్న వెళ్ళినట్టుగా ఉంది. నేను కెమెరా ముందు నిలబడిన రోజు తర్వాత ఏం జరగబోతుందో తెలియని భయానికి లోనయ్యాను. సినిమాల్లోని పాత్రల ద్వారా చాలా జీవితాలను చూశాను. ప్రతి పాత్ర నాకు ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పింది. ప్రతి సందేశం, ప్రతి ప్రోత్సాహం, ప్రతి ప్రేమ నాకు బలంగా మారింది. అందువల్ల ఈ జర్నీ కేవలం నా ఒక్కదానిదే కాదు. ఇది అందరిదీ. ఇది ప్రారంభం మాత్రమే' అని పేర్కొన్నారు.

'కళ్యాణి' ప్రధాన పాత్రలో

కొత్త మూవీ ప్రారంభోత్సవం



యువనటి కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో కొత్త చిత్రం ప్రారంభమైంది. పొటెన్షియల్ స్టూడియోస్ పతాకంపై ఎస్.ఆర్.ప్రభు నిర్మాణంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ ద్రవియం దర్శకత్వం వహిస్తున్నారు. నగరంలో పూజా కార్యక్రమంతో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించారు. ఈ చిత్రీకరణ చెన్నై, పరిసర ప్రాంతాల్లో పూర్తి చేయనున్నారు. ముఖ్య పాత్రల్లో దేవదర్శిణి, 'నాన్ మగాన్ అల్ల' ఫేం వినోద్ కిషన్ నటిస్తున్నారు. అలాగే, మరికొందరు ప్రముఖ నటీనటులు ఇందులో నటించనున్నారు. 'లోకా' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత కళ్యాణి ప్రియదర్శన్ నటిస్తుండటం, 'మాయా', 'మానగరం', 'మాన్‌స్టర్', 'టాణాక్కారన్', 'ఇరుగపట్రు', 'బ్లాక్' వంటి సినిమాలు నిర్మించిన పొటెన్షియల్ స్టూడియో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి.

సత్యసాయి సందేశం..

నేటి తరానికి ఆచరణీయం

- పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యం, ప్రేమ, ధర్మం, శాంతి, అహింస అనే ఐదు అంశాలను ప్రధానంగా చేసుకుని సత్యసాయిబాబు మానవాళికి అందించిన అపూర్వమైన సందేశాలు నేటి యువతకు ఆచరణీయమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా 'శిష్యకులం' ఆధ్వర్యంలో నగరంలోని ముత్తు వెంకటసుబ్బారావు హాలులో 'సాయి శిష్య సహస్ర - సత్యసాయి బాబా శతజయంతి స్మారక సంగీత సమర్పణ' పేరిట విశిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్ణాటక, హిందూస్థానీ, భజన, చిత్ర సంగీత సంప్రదాయాల కళాకారులు ఒకే వేదికపై ఆధ్యాత్మిక సంగీత ప్రదర్శన ఇచ్చారు. ఆరేళ్ల చిన్నారుల నుండి అరవైయేళ్లు దాటిన వృద్ధుల వరకు 200 మంది గాయక బృందం సామూహిక సంగీత కచేరి శ్రోతలను మైమరపించింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ భారతీయ కళా సంస్కృతిని ఆధునిక రూపంలో పునరావిష్కరిస్తున్న 'శిష్య కులం' సంస్థ కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ 'సాయి శిష్య సమర్పణ' కార్యక్రమం శ్రీసత్యసాయి బాబాకు గొప్ప నివాళి మాత్రమే కాక, భారతీయ సంగీత వైభవానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు.



చెన్నైలో 'సాయి శిష్య సమర్పణ' కార్యక్రమంలో సత్యసాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

తిరుచెందూర్‌కు పోటెత్తిన భక్తజనం



తిరుచెందూర్ ఆలయం వద్ద భక్తులు

వెనక్కి వెళ్లిన సముద్రం



ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వళ్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన ఆరు ప్రధాన క్షేత్రాల్లో రెండవదైన తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లోని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సముద్రతీరంలో ఉన్న ఈ శైవక్షేత్రాన్ని ఏడాదిపొడవునా భక్తులు సందర్శిస్తుంటారు. సెలవురోజులు, పండుగ సీజన్‌లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు విశ్వరూప దీపారాధనన శివాచార్యులు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు దీపారాధన, 6 గంటలకు ఉదయ మార్తాండాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కాగా, దర్శనం కోసం వెళ్లిన భక్తులు ముందుగా సముద్రంలో దిగి పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో అలల్లో చిక్కుకోకుండా గజ ఈతగాళ్లతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

158 ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు...

తిరుచెందూరు ఆలయ ప్రాకారంలో ఓ మహిళ సినిమా పాటకు స్టెప్పులేస్తూ ఇన్‌స్టా రీల్స్ చేసిన నేపథ్యంలో, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆలయ అధికారులు పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులు సులువుగా అర్థం చేసుకునే రీతిలో ఆలయ ప్రాంగణాల్లో 15 ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టించారు. ఆలయ విధి విధానాలు, నిబంధనలను ఉల్లంఘించే వారిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోనున్న హెచ్చరించారు.

వెనక్కి వెళ్లిన సముద్రం...

తిరుచెందూర్‌లో సముద్రం వందడుగుల వెనక్కి మళ్లింది. అమావాస్యపౌర్ణమి రోజుల్లో సముద్రం వెనక్కి వెళ్లి, కొన్ని గంటల తర్వాత యధాస్థాయికి చేరుకోవడం జరుగుతోంది. ఈ క్రమంలో, ఆదివారం సముద్రం దాదాపు వందడుగులు వెనక్కి మళ్లడంతో పాచిపట్టిన బండరాళ్లు, సముద్రపు జీవులు బయటికి కనిపించాయి. అయినప్పటికీ భక్తులు సముద్రంలోకి దిగి స్నానమాచరించి సుబ్రమణ్యస్వామివారిని దర్శనం చేసుకున్నారు. కొంతమంది భక్తులు పాచిపట్టిన బండరాళ్ల వద్ద సెల్ఫీలు దిగారు. మరికొంత మంది చిన్నారులు తీరంలో కేరింతలతో సందడి చేశారు.

కేజీఎఫ్ సేవలు విశ్వవ్యాప్తం

- జెట్టి కుసుమకుమార్

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) సేవలను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, హైదరాబాదుకు చెందిన జెట్టి కుసుమకుమార్ పేర్కొన్నారు. భగవత్ రామానుజుల జన్మస్థలమైన కాంచీపురం జిల్లా శ్రీ పెరంబదూరులో 255 ఎకరాల్లో 2026 ఫిబ్రవరి 8వ తేదీ నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లపై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్నానగర్‌లోని డీకే కల్యాణమండపంలో తమిళనాడులోని 25 కమ్మ నాయుడు సంఘాలతో నిర్వహించిన ఈ సమావేశానికి చెన్నై కమ్మ నాయుడు వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎ.జయరామన్, తమిళనాడు కమ్మ నాయుడు మహాజన సంఘం వ్యవస్థాపకుడు వీఎస్ రామన్‌లు సారథ్యం వహించారు. జెట్టి కుసుమకుమార్ ముఖ్యఅతిథిగా ఈ సమావేశంలో పాల్గొని కేజీఎఫ్ అందిస్తున్న సేవలను సమగ్రంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మవారిని ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న లక్ష్యంతో 2024లో హైదరాబాదులో కేజీఎఫ్ స్థాపించి మొదటి సారిగా నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో 32 దేశాలకు చెందిన కమ్మసంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ సమావేశం ద్వారా తమ సంస్థకు మరింత గుర్తింపు వచ్చిందని, తమ సేవలను విశ్వవ్యాప్తం చేయడమే ఏకైక లక్ష్యమన్నారు. తమిళనాట అన్ని జిల్లాల్లో ఉన్న కమ్మ సంఘాలన్నీ ఒకే గూటికి చేర్చాలన్న ఉద్దేశంతోనే కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు వేదికగా వచ్చే ఏడాది భారీస్థాయిలో నిర్వహించనున్న మహానాడుకు మద్దతు సేకరించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2కోట్ల 10లక్షల మందికి పైగా కమ్మ సామాజిక వర్గానికి చెందినవారున్నారని, తమిళనాడులో దాదాపు 60 లక్షల మంది ఉన్నప్పటికీ ప్రభుత్వ రాయితీలు, గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్మ సంఘాల మధ్య సఖ్యత పెంపొందింపజేయడంలో కేజీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని కుసుమకుమార్ అన్నారు. అనంతరం ఎ.జయరామన్ మాట్లాడుతూ, కమ్మ సంఘాల్లో ఐక్యత పెంపొందింపజేయాలన్న సంకల్పంతో మహానాడు నిర్వహించేందుకు ముందుకొచ్చిన కేజీఎఫ్ సంస్థను ప్రోత్సహించాలే కానీ విమర్శించవద్దన్నారు. వీఎస్ రామన్ మాట్లాడుతూ, పార్లమెంటు, అసెంబ్లీల్లో కమ్మ ప్రతినిధుల సంఖ్య పెరిగితేనే రాజకీయ పార్టీలు గుర్తిస్తాయన్నారు. ఆ తర్వాత ఉత్తర చెన్నై కమ్మ నాయుడు సంక్షేమ సంఘం కార్యదర్శి వీజీ జయకుమార్ మాట్లాడుతూ, జెట్టి కుసుమకుమార్ లక్ష్యం తప్పక ఫలిస్తుందని, కేజీఎఫ్ మహానాడు విజయవంతం చేసి మన బలం, ఐక్యమత్యాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఈడ్పుగంటి సుబ్బారావు, వి.ప్రకాష్, నర్రా రాఘవేంద్రరావు, పూదోట సౌరిరాజు, డాక్టర్ చంద్రకాంత్, చక్రపాణి, అచ్యుతయ్య, తాళ్లూరి సుధాకర్, గుమ్మడి శ్రీనివాసరావు, ముంద్రు శ్రీనివాసరావు, టీటీఎఫ్ నేతలు రంగభాష్యం, అనంతరామన్, అచ్యుతయ్య, డాక్టర్ ఉషారాణి, పొన్నేరి శరత్, వెంకట విజయ్, ఎస్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మ సంఘాల ప్రతినిధులతో కేజీఎఫ్ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ తదితరులు

తెన్‌కాశి జిల్లాలో భారీ వర్షాలు

- కుట్రాలం జలపాతాల్లో స్నానాల నిషేధం

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కుట్రాలంలోని ఐదు జలపాతాల వద్ద స్నానాలకు నిషేధించడంతో పర్యాటకులు నిరాశకు గురైయ్యారు. శనివారం నుండి జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, వాగుల్లో వర్షపు నీరు భారీగా చేరింది. శనివారం మధ్యాహ్నం కుట్రాలంలోని ఐదు జలపాతాల వద్ద పర్యాటకులను స్నానాలకు అనుమతించిన నేపథ్యంలో, సాయంత్రం నుండి వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వర్షం జోరందుకుంది. ఇక్కడున్న ఐదు జలపాతాల్లో నీటి ఉధృతి అధికం కావడంతో జిల్లా యంత్రాంగం ఆదివారం ఉదయం నుంచి స్నానాలపై నిషేధం విధించారు.. దీంతో పోలీసులు జలపాతాల ఛాయలకు పర్యాటకులను రానివ్వడం లేదు.



కుట్రాలం జలపాతం వద్ద పోలీస్ బందోబస్తు

సమాచార దర్శిని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.

గుమ్మిడిపూండి: మాదరపాక్కం, పాదిరివేడు, నెల్లూరు, ఎస్ఎస్ నగర్, రోజా నగర్, సెంథిల్‌కుప్పం, పల్లవాడ, కన్నంబాక్కం, అల్లికుప్పం, రామచంద్రాపురం, పొందవాక్కం, సూరపావూండి, ఎగువరపాళయం, చితుర్నాధం, కారంబేడు, మేల్‌పాక్కం, బొమ్మాచ్చికుళం, పనాత్తుమెట్టు కండిగై, నాగరాజు కండిగై, కేఎన్ పేట, కొంగల్.

ఎగ్మూర్: ఎగ్మూర్ హైరోడ్డు, గెంగురెడ్డి వీధి, వీరస్వామి వీధి, పెరుమాళ్ రెడ్డి వీధి, కెంప్ రోడ్డు, జగదామమ్మాళ్ ఆలయ వీధి, ఎంఎస్ నగర్, చెట్‌పేట్, పాథ్రన్ రోడ్డు, మాంటీత్ రోడ్డు, మార్షల్ రోడ్డు, ఎతిరాజ్ రోడ్డు, మోతిలాల్ లైన్, పాత కమిషనర్ ఆఫీస్, జడ్జెస్ క్వార్టర్స్

26 నుంచి పవిత్రోత్సవాలు

ప్యారీస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జి టౌన్ వరదాముత్తియప్పవీధిలోని గీతా మందిరంలో ఈ నెల 26, 27వ తేదీల్లో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. మద్రాస్ యతిరాజ సేవా మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అంకురార్పణ, పవిత్రాల శుద్ధి, భజన, 27వ తేదీ ఉదయం నుండి హోమం, పూర్ణాహుతి, పవిత్రాల సమర్పణ, సంప్రోక్షణ, హారతి, తీర్థప్రసాదాల వినియోగం వుంటుంది. ఈ రెండు రోజుల ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని మండలి అధ్యక్షురాలు తవ్వా విజయలక్ష్మి, కార్యదర్శి ఉషా గణేశన్, కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

'సర్'కు వ్యతిరేకంగా సుప్రీంలో టీవీకే రిట్ పిటిషన్

అడయార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుతో సహా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్‌కు వ్యతిరేకంగా హీరో విజయ్ సారథ్యంలోని టీవీకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సమగ్ర సవరణ తక్షణం నిలిపివేయాలని అందులో పేర్కొంది. ఈ రిట్ పిటిషన్‌పై ఈ నెల 26న సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది.

వీధుల్లో తిరిగే పశువుల కోసం సంరక్షణ కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 14 కొత్త పశువుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఈ మేరకు జీసీసీ అధికారులు మాట్లాడుతూ... జీసీసీ పరిధిలో 22 వేల పశువులున్నట్లు ఇటీవల నిర్వహించిన గణన ద్వారా తెలిసిందన్నారు. ఈ పశువులు రోడ్లపై సంచరిస్తున్న సమయంలో వాహన ప్రమాదాలు, ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తుతోందని, కొన్ని ఘటనల్లో పశువుల దాడిలో పలువురు గాయపడిన ఘటనలు నెలకొన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా, ప్రస్తుతం మూడు పశువుల సంరక్షణ కేంద్రాలున్నాయన్నారు. రాయపురం మండలంలో 350 పశువులు (ప్రతిరోజు ఒక పశువుకు రూ.10 ఛార్జి), తిరువొత్తియూర్ మండలంలో 40 పశువులు, మాధవరం మండలంలో వంద పశువులుండేలా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ క్రమంలో, కొత్తగా 14 కొత్త పశువుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. దీంతో, రోడ్లపై సంచరిస్తున్న పశువులను బంధించి, ఈ కేంద్రాలకు తరలించనున్నామని తెలిపారు. వాటిని ఉచితంగా లేదా తక్కువ ఛార్జీతో అందించనున్నామని తెలిపారు. పశువుల యజమానులు తక్కువ ఛార్జీ చెల్లించి వారి పశువులను తీసుకెళ్లవచ్చని అధికారులు తెలిపారు.

కీళడిలో జనవరి నుంచి పురావస్తు తవ్వకాలు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కీళడిలో వచ్చే ఏడాది 11వ విడత తవ్వకాలు ప్రారంభించాలని పురావస్తు శాఖ పరిశీలిస్తోంది. కీళడిలో కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నదీతీర నాగరికత గుర్తించేలా 2015లో తవ్వకాలు ప్రారంభించింది. మూడు దశల తవ్వకాల అనంతరం, రాష్ట్ర పురావస్తు శాఖ తవ్వకాలు చేపట్టింది. ప్రతి ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాల్లో దొరికిన వస్తువులపై పత్రాలు తయారుచేసి, కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖకు నివేదికగా అందజేస్తుంటారు. ఆ నివేదిక పరిశీలన అనంతరం తదుపరి తవ్వకాలకు అనుమతిస్తోంది. ఈ క్రమంలో, 10వ విడత తవ్వకాలు 2024 లోక్‌సభ ఎన్నికల కారణంగా జనవరికి బదులు జూన్ 18వ తేది కీళడిలో ప్రారంభించారు. జూన్‌లో పనులు ప్రారంభం కావడంతో 2025 మార్చి వరకు పనులు జరుగుతాయని పురావస్తు శాఖ ప్రకటించింది. అనంతరం 11వ విడత తవ్వకాలు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో, 10వ విడత తవ్వకాల్లో లభ్యమైన వస్తువుల పత్రాలు కేంద్ర పురావస్తు శాఖకు అందజేసినట్లు, అందువల్ల వచ్చే ఏడాది జనవరిలో 11వ విడత తవ్వకాలు ప్రారంభమయ్యే అవకాశముందని రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు తెలిపారు.

టమోటా కిలో రూ.80...!

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌కు టమోటా దిగుమతి తగ్గడంతో, హోల్‌సేల్‌గా కిలో రూ.70, చిల్లర దుకాణాల్లో రూ.80కి విక్రయమవుతోంది. రాజధాని నగరం చెన్నై నగరవాసులకు ప్రతిరోజు 1,200 టన్నుల టమోటా అవసరమవుతోంది. టమోటా అధికంగా సాగుచేస్తున్న కృష్ణగిరి, హోసూరు, తేని తదితర ప్రాంతాలు సహా ఆంధ్ర, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాల నుంచి టమోటా దిగుమతవుతోంది. ప్రస్తుతం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో, కోయంబేడు మార్కెట్‌కు టమోటా దిగుమతులు తగ్గాయి. శనివారం ఈ మార్కెట్‌కు 500-700 టన్నుల టమోటా మాత్రమే దిగుమతయింది. అదే సమయంలో, మొదటి రకం టమోటా 300 టన్నులు మాత్రమే వచ్చింది. శుక్రవారం టమోటా కిలో రూ.20 రూ.30కి విక్రయమైన నేపథ్యంలో, ఒకేరోజు కిలోకు రూ.20 నుంచి రూ.30కి పెరిగింది. ఆ ప్రకారం, మొదటి రకం రూ.60, రెండవ రకం రూ.40-50, చిల్లర దుకాణాల్లో మొదటి రకం టమోటా కిలో రూ.80కి విక్రయమవుతోంది.

26న కార్మిక సంఘాల ఆందోళన

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కార్మిక సంఘాల సమాఖ్య ఆందోళన చేపట్టనున్నాయి. దీనిపై కార్మిక సంఘాల నేతలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు.

సురక్షిత పర్యావరణం

● 1.75 లక్షల మొక్కలు పంపిణీ చేయనున్న అటవీ శాఖ

రైతులకు ఆదాయం మార్గం




మొక్కల సంరక్షణలో సిబ్బంది- పూండిలో పంపిణీకి సిద్ధంగా మొక్కలు

తిరువళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆదాయాన్ని పెంచడంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయం సమకూరే వ్యవసాయాన్ని అందించాలనే లక్ష్యంతో నేషనల్ మిషన్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకం కింద 1.75 లక్షల మొక్కలను తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఇందు కోసం తిరువళ్లూరు జిల్లా పూండిలో అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు చేసి 24 రకాలకు చెందిన 1.75 లక్షల మొక్కలు పెంచుతున్నారు. వీటిని త్వరలో రైతులకు అందించనున్నారు. దేశ వ్యాప్తంగా అడవుల విస్తీర్ణం తగ్గుతుండడంతో వాతావరణంలో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణం కలుషితమై పర్యావరణానికి హాని కలిగే చర్యలు అడ్డుకొనేలా, రైతుల ద్వారా చెట్లు పెంపకానికి శ్రీకారం చుట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు వ్యవసాయాన్ని లాభసాటి చేయడం, రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అందించడం ఈ పథకం లక్ష్యం. ఇందు కోసం నీరు సమృద్ధిగా ఉంటూ వ్యవసాయం చేయని భూముల్లో తిరిగి సాగు చేపట్టడం, సాగులో ఉన్న పొలాల చుట్టూ చెట్లును నాటాలని నిర్ణయించారు. ఇందు కోసం వ్యవసాయ భూములున్న రైతులను గుర్తించి వారికి నేషనల్ మిషన్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకంలో 1.75 లక్షల మొక్కలను ఇవ్వాలని నిర్ణయించి పెంపకానికి శ్రీకారం చుట్టారు. తిరువళ్లూరు జిల్లా అటవీశాఖ అధికారి కిరణ్ మాట్లాడుతూ... నేషనల్ మిషన్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకం కింద వ్యవసాయ భూములున్న రైతులను గుర్తించి వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేసి పెంచాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగానే ఎర్రచందనం, టేకు, మామిడి, జామ తదితర 24 రకాల 1.74 లక్షల మొక్కలను పెంచుతున్నాం. బయో వైవిధ్యం పచ్చదనం ప్రాజెక్టులో భాగంగా చెట్లను పెంచాలన్నది ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. త్వరలో పరిస్థితులు చక్కబడితే రైతులు నేరుగా నర్సరీకి వచ్చి వారికి నచ్చిన మొక్కలను తీసుకెళ్ళి పెంచుకోవచ్చు. వీటికి అవసరమైన మొక్కలను ఉచితంగా అందించడంతో పాటు సాగు పద్ధతులను కూడా వివరించనున్నామని తెలిపారు. తాము చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాన్నిస్తే రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అందించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడతామని ఆయన వివరించారు.

వీరాంజనేయాలయంలో కార్తిక పూజలు



క్షీరకలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని మెట్టువీధిలో కొలువైన వీరాంజనేయస్వామివారి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను డిసెంబరు 19న హనుమజ్జయంతి వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు 108 క్షీర కలశాలను ఆదివారం ఉదయం ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి ఆలయ పూజారులకు అందజేయగా, అర్చకులు స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.. అనంతరం భక్తులు స్వామివారి కంకణధారణ చేసి వ్రతమాచరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందినన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోపై తాటిచెట్టు పడి డ్రైవర్ మృతి



తాటిచెట్టు పడటంతో ధ్వంసమైన ఆటో

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనవరం ప్రాంతంలో వేగంగా వెళుతున్న ఆటోపై తాటి చెట్టు పడటంతో డ్రైవర్ మృతి చెందాడు. తండయార్‌పేట వీఓసీ నగర్‌కు చెందిన అబ్దుల్ వాహిద్ (38) అనే ఆటో డ్రైవర్ రోజూ బడిపిల్లలను పాఠశాలకు విడిచిపెడుతుంటాడు. ఆమేరకు శనివారం నుంగంబాక్కం ప్రైవేటు స్కూలులో చదువుతున్న 11 వ తరగతి విద్యార్థినిని అయనావరంలోని ఆమె ఇంటికి ఆటోలో తీసుకెళ్తుండగా ప్రభుత్వ మానసిక చికిత్సా కేంద్రం వద్దనున్న తాటి చెట్టు ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో అబ్దుల్‌వాహిద్ అక్కడికక్కడే మరణించాడు. ఆటోలో ఉన్న విద్యార్థిని ప్రమాదం తప్పించుకుంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి నలిగిన ఆటోలో చిక్కుకున్న విద్యార్థినిని బయటకు తీశారు. సెక్రటేరియట్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సాయి సంస్థాన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంస్థాన్ నిర్వాహకురాలు పుణ్యవతి మాట్లాడుతూ, సత్యసాయి అవతార పురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో దేవిక, లీలావతి, మీనా దామోదర్ పిళ్లై, దినకరన్, లోకనాధన్, బాబు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'సర్' సహాయక కేంద్రాల పరిశీలన



బీఎల్వోలతో కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహాయక కేంద్రాలను తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఆదివారం పరిశీలించారు. తిరువొత్తియూర్, పొన్నేరి, మాధవరం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్, ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు అందజేసిన, స్వీకరంచిన ఫారాల వివరాలు అడిగి తెలుసుకున్నారు అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగించే అవకాశం ఉండదని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ సోమసుందరం, పలువురు అధికారులు ఉన్నారు.



వేలూరులోని సాయినాథపురం కృష్ణస్వామి మొదలియార్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం నిర్వహించిన సర్ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి, వేలూరు కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్ తదితరులు

ఫైరింగ్ చేసి గంజాయి వ్యాపారి అరెస్టు



గంజాయి వ్యాపారికి చికిత్స చేస్తున్న వైద్యులు

చెన్నై, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా అన్నామలై నగర్ వద్ద ఆదివారం వేకువజాము పారిపోతున్న గంజాయి వ్యాపారిపై కాల్పులు జరిపి అరెస్టు చేశారు. ఈ సంఘటనలో ఆ వ్యాపారి కుడి కాలిలోకి తూటా దూసుకెళ్లటంతో గాయపడ్డాడు. వల్లం ప్రాతానికి చెందిన నవీన్ గంజాయి వ్యాపారం చేస్తుండేవాడు. ఇటీవల అతడి ఇంటిలో నుంచి 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న అన్నమలై నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నవీన్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజాము నవీన్ అన్నామలైన నగర్ వద్ద దాగినట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ అంబేద్కర్ నేతృత్వంలో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని నవీన్‌ను చుట్టుముట్టారు. వెంటనే నవీన్ పోలీసులపై వేటకొడవళ్లతో దాడి జరిపాడు. ఆ దాడిలో అయ్యప్పన్ అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. ఆ తర్వాత అతడు పారిపోతుండగా సీఐ అంబేద్కర్ అతడిపై తుపాకీతో కాల్పులు జరపడంతో అతను పడిపోయాడు. వెంటనే పోలీసులు అతడిని నిర్బంధించి చిదంబరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన కానిస్టేబుల్ అయ్యప్పన్‌ను కూడా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని 11 ఆవులు మృతి



మృతిచెందిన, గాయపడిన ఆవులు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని 11 ఆవులు మృతిచెందగా, మరో 20 గాయపడ్డాయి. తెన్‌కాశి జిల్లా వాసుదేవనల్లూర్‌కు చెందిన పేచ్చియప్పన్ వందకు పైగా స్వదేశీ ఆవులను పెంచుతున్నాడు. అదే ప్రాంతంలోని తోటలో పాక వేసి ఆవులను ఉంచాడు. ఆవులను మేత కోసం మదురై-తెన్‌కాశి రహదారి సమీపంలోని పొలాలకు తీసుకెళ్తుంటాడు. శనివారం ఆవులను రోడ్డు దాటిస్తున్న సమయంలో, ఆ మార్గంలో వచ్చిన ఇటుకల లారీ ఢీకొంది. ఈ ఘటనలో 11 ఆవులు అక్కడికక్కడే మృతి చెందగా, 20కిపైగా గాయపడ్డాయి. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు రోడ్డుపై పడిన ఆవుల కళేబరాలు తొలగించారు. కేసు నమోదుచేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కూలిన వాటర్ ట్యాంక్



కూలిన వాటర్ ట్యాంక్

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య అర్థరాత్రి వేళ వాటర్ ట్యాంక్ కూలడం కలకలం రేపింది. దిండుగల్ జిల్లా మారంబాడిలో 1997లో 60వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించారు. అనంతరం చుట్టుపక్కల ఇళ్లు నిర్మాణాలు జరాయి. ఈ క్రమంలో, వాటర్ ట్యాంక్ పల్లర్ల పెచ్చులు ఊడిపోతుండడంతో స్థానికులు గ్రామ సర్పంచ్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు పిర్యాదు చేఉసినా ఫలితం లేకపోయిందని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, శనివారం అర్ధరాత్రి హఠాత్తుగా వాటర్ ట్యాంక్ నేలకూలింది. అర్ధరాత్రి కావడంతో ఆ ప్రాంతంలో ఎలాంటి జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పోక్సో కేసులపై పోలీసు అధికారులకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న మహిళా పోలీసు అధికారులు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని ఈస్ట్ జోన్ ఏసీపీ కార్యాయంలో మహిళా పోలీసు అధికారులకు పోక్సో కేసులపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. నగరంలో కొద్దికాలంగా మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపుల కేసులు అధికమవుతున్నాయి. ఆ అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదుచేస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు నగరంలోని మహిళా పోలీసు స్టేషన్ అధికారులకు పోక్సో కేసులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 15వ తేది మొదటి విడత సమావేశం నిర్వహించగా, శనివారం రెండో విడత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 18 ఎస్ఐలు 8 మంది ఏఎస్ఐలు, 19 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్ళిందన్న కోపంతో...

ఇద్దరు కుమార్తెల హత్య, ఆపై ఆత్మహత్య



గోపిరాజ్, కుమార్తెలు కనిష్క, యువశ్రీ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు (ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్ళి తిరిగిరాలేదన్న కోపంతో ఓ భర్త తన ఇద్దరు కుమార్తెలను హతమార్చి, ఉరేసుకుని తనూ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదురై అలంకుళం ప్రాంతంలో చోటచేసుకుంది. అలంకుళం ముడకత్తాన్ ప్రాంతంలో గోపిరాజ్ (40), గాయత్రి అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి యువశ్రీ (10), కనిష్కా (5) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. గోపిరాజ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం భర్తతో గొడవపడి గాయత్రి పుట్టింటికి వెళ్ళింది. దీంతో గోపిరాజ్ భార్యను పిలుచుకు వచ్చేందుకు ప్రయత్నించినా ఆమె రాకపోవడంతో శనివారం రాత్రి తన ఇద్దరు కుమార్తెలను వైర్‌తో గొంతు నులిపి హతమార్చి, ఆ తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గోపిరాజ్ ఇంటి నుండి ఎలాంటి అలికిడి లేకపోవటంతో ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన ప్రాంతానికి వెళ్ళి గోపిరాజ్ ఇంటి తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్ళి చూడగా నేలపై ఇద్దరు కుమార్తెలు శవాలుగా పడిఉండగా, ఉరేసుకుని గోపిరాజ్ వేలాడుతుండటాన్ని గమనించారు. ఆ తర్వాత ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు

శబరిమలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఆధ్వర్యంలో శబరిమలకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు ఎస్ఈటీసీ విడదుల చేసిన ప్రకటనలో... శబరిమలలో మండల పూజ, మహా దీప పూజను పురస్కరించుకుని రాష్ట్రం నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏడాది ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం కోయంబేడు, కిలాంబాక్కం, తిరుచ్చి, మదురై, పుదుచ్చేరి, కడలూరు ప్రాంతాల నుంచి పంబకు ఏసీ, బెర్త్ సౌకర్యం కలిగిన అధునాతన బస్సులను ఈ నెల 16 నుంచి నడుపుతున్నామని తెలిపింది. అలాగే, హోసూరు, ధర్మపురి, కృష్ణగిరి, సేలం, కరూర్ తదితర ప్రాంతాల నుంచి కూడా ఈ నెల 28 నుంచి 2025 జనవరి 16వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నామని తెలిపింది. డిసెంబరు 27 నుంచి 30వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఆలయం మూసివేయనున్నామని శబరిమల దేవస్థానం ప్రకటన మేరకు, డిసెంబరు 26 నుంచి 29వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సు సేవలు ఉండవన్నారు. అయ్యప్ప భక్తులు ప్రత్యేక బస్సుల వివరాలు, రిజర్వేషన్‌కు www.tnstc.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ప్రకటనలో తెలిపింది.

'నేను నకిలీ టీచర్‌ని కాను'...! ప్రమాణ పత్రం సమర్పించాలని ఉత్తర్వు

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, 'నేను నకిలీ ఉపాధ్యాయుడిని కాను' అని వచ్చే నెలలోగా నిరూపించుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు ఫిర్యాదులున్నాయి. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారి టెన్త్, ప్లస్ టూ, డిగ్రీ, డిప్లొమో సర్టిఫికెట్ల ప్రామాణికతను ధ్రువీకరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ విషయమై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాలు, ప్రయోజనాలు పొందేందుకు 'ప్రామాణికత ధ్రువీకరణ పత్రం పొందవలసి ఉంటుందన్నారు. అంటే, ఉద్యోగంలో చేరిన ఆరు నెలల్లోపు, ఒక వ్యక్తి తన టెన్త్, ప్లస్ టూ, డిగ్రీ, డిప్లొమో కోర్సుల ఒరిజినల్ సరిఫికెట్లు తన ఉన్నతాధికారికి చూపించి ఆమోదించుకోవాల్సి ఉంటుందన్నారు. వీటిని సాధారంగా డీఈఓ-సీఈఓ ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగంలో పనిచేసే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యాలయానికి పంపుతారని తెలిపారు. అక్కడ, ఆ సర్టిఫికెట్ల వివరాలు పరిశీలించిన పరీక్షల డైరెక్టరేట్, ట్రెజరీలో నమోదుచేయబడిన సర్టిఫికెట్లతో సరిచూసి 'ప్రామాణికత ధృవీకరణ పత్రం' జారీ చేస్తుందన్నారు. ప్రతి తనిఖీలోనూ ఈ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా, పదవీ విరమణ ప్రయోజనాలు పొందేందుకు ఈ సర్టిఫికెట్ తప్పనిసరన్నారు.

కుమార్తెను కాటేసిన ప్రబుద్ధుడికి యావజ్జీవం

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మూడేళ్లక్రితం కోయంబత్తూర్ జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి భార్య ఇంట్లో లేని సమయంలో మద్యం మత్తులో తన 15 ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తల్లికి చెబితే హతమారుస్తానని కుమార్తెను బెదిరించాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో పీఎన్ పాళయం పోలీసులు 2022 సెప్టెంబరు 29న కేసు నమోదుచేసి కామాంధుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు కోవై ప్రిన్సిపల్ పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో నేరారోపణ నిరూపణ అవడంతో, కామాంధ తండ్రికి యావజ్జీవ జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి భగవతియమ్మాళ్ తీర్పునిచ్చారు. అలాగే, బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

మరో ఇద్దరు యువతుల అదృశ్యం !

తిరువళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతులు అదృశ్యమవుతున్న ఘటనలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ముప్పేడు, గుమ్మిడిపూండి ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యం కావడంతో పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. తాజాగా, మరో ఇద్దరు యువతులు అదృశ్యం కావడం కలకలం రేపింది. చిన్నంబేడు గ్రామానికి చెందిన యువతి(22) ఓ కంపెనీలో పనిచేస్తోంది. ఈమె ఈ నెల 21వ తేది ఉదయం విధులకు వెళ్ళి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో ఆరణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఆర్కే పేటలో ఓ గ్రామానికి చెందిన యువతి (18) తల్లి కువైట్‌లో పని చేస్తుండడంతో, వేరే ప్రాంతంలో ఉన్న అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. ఈ నెల 22వ తేది సాయంత్రం నోట్‌బుక్ కోసం వెళ్ళి తిరిగి రాలేదు. బంధువులు గాలించి ఫలితం లేకపోవడంతో ఆర్కే పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి యువతి కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

తిరువళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌ను మోటార్ బైక్ ఢీకొన్న ఘటనలో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. తిరువళ్లూరు జిల్లా సెంజి ఇరులర్ కాలనీకి చెందిన రమేష్ కుమారుడు శక్తివేల్ (13) తల్లిదండ్రులు చనిపోవడంతో చిట్టంబాక్కంలోని మేనమామ కుప్పన్ సంరక్షణలో ఉన్నాడు. శక్తివేల్ సెంజి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం నిత్యవసర సరుకుల కోసం శక్తివేల్ సైకిల్‌పై వెళ్ళుతున్న సమయంలో వెనుక న ఉంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సైకిల్ నుంచి కిందపడిన శక్తివేల్‌కు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుప్పన్ ఫిర్యాదుతో కడంబత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి, బైక్‌తో ఢీకొని పరారైన యువకుల కోసం గాలిస్తున్నారు.

కరోనా మృతుల వారసులకు ఉద్యోగాలివ్వాలి

● ఈపీఎస్ డిమాండ్

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కాలంలో విధి నిర్వహణలో మృతిచెందిన ప్రభుత్వ ఉద్యోగుల వారసులకు ఉద్యోగం కల్పించి ఎన్నికల హామీని నెరవేర్చాలని మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... కొవిడ్ కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, వైద్యులు, వైద్య సిబ్బంది, స్థానిక సంస్థల అధికారుల మృతిచెందారన్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో కరోనా మృతుల కుటుంబాలను ఆదుకుంటామని డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిందన్నారు. కానీ, అధికారం చేపట్టి 54 నెలలు గడిచినా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మృతిచెందితే కారుణ్య ప్రాతిపదికన వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించే నిబంధన అమలులో ఉందన్నారు. ఆ ప్రకారం, కరోనా మృతుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఓపీఎస్ డిమాండ్ చేశారు.

'నలం కాక్కుం స్టాలిన్'తో 9.38 లక్షల మందికి లబ్ధి

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా 9.38 లక్షల మంది లబ్ధి పొందారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపింది. ప్రతి శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాల్లో, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ సహా పలురకాల పరీక్షలు, చికిత్స అందిస్తున్నట్లు తెలిపింది. ఈ శిబిరాల్లో ముఖ్యమంత్రి బీమా పథకం నమోదు, దివ్యాంగులకు గుర్తింపు కార్డులు వంటివి అందిస్తున్నామని తెలిపింది. శనివారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరాల్లో 56,139 మంది లబ్ధి పొందారని, ఇప్పటివరకు నిర్వహించిన 16 ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 9.38 లక్షల మంది లబ్ధిపొందారని ఆరోగ్యశాఖ తెలిపింది.

మృతిచెందిన హెచ్‌సీ కుటుంబానికి రూ.30 లక్షల ఆర్థికసాయం

● సీఎం స్టాలిన్ ప్రకటన

పెరంబూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెచ్‌సీ కుటుంబానికి సీఎం స్టాలిన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... చెంగల్పట్టు జిల్లా కూవత్తూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అళగేశన్ ఈ నెల 19న పుదుచ్చేరి-చెన్నై ఈసీఆర్ రోడ్డులో బైక్‌లో వస్తుండగా కారు ఢీకొని మృతిచెందారు. అళగేశన్ మృతికి సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆ కుటుంబానికి రూ.30 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు సీఎం ప్రకటించారని సచివాలయం ప్రకటనలో తెలిపింది.